క్లుప్తంగా

పీహెచ్‌సీలో స్పెషలిస్ట్ వైద్యుల సేవలు



పీహెచ్‌సీలో మహిళ మెడికల్ రిపోర్టును పరిశీలిస్తున్న డాక్టర్ మృదుల

ఉండ్రాజవరం: స్థానిక పీహెచ్‌సీలో శుక్రవారం స్పెషలిస్ట్ వైద్యులు రోగులకు సేవలు అందించారు. ప్రసూతి స్త్రీల వైద్య నిపుణురాలు మృదుల 12 మందిని, ఊపిరితిత్తులు, శ్వాసకోశ నిపుణురాలు మేరీ వసంత నలుగురిని పరీక్షించారు. వారికి తగిన సలహాలు, సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా ఉండ్రాజవరం పీహెచ్‌సీ డాక్టర్ రాజనాల ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి నెలా మూడో శుక్రవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఈ పీహెచ్‌సీలో స్పెషలిస్ట్ వైద్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు.

వర్షంతో పల్లపు ప్రాంతాల జలమయం

నిడదవోలు రూరల్: నిడదవోలు మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం ఉదయం నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు, పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. భారీ వాహనాల రాకపోకలతో నిడదవోలు–నరసాపురం ప్రధాన రోడ్డు అధ్వానంగా తయారైంది. చిన్నపాటి వర్షానికి గోతులు పెద్దవిగా తయారై వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

ఎమ్మెల్యేకు సమస్యలు నివేదించిన వీఓఏలు

గోపాలపురం: తమ సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరుతూ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)లో పనిచేస్తున్న విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు (వీఓఏ)లు శుక్రవారం ఎమ్మెల్యే తలారి వెంకట్రావును దేవరపల్లిలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో కలసి వినతి పత్రాన్ని అందజేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, వీఓఏలకు వ్యక్తిగత ఖాతాలు తెరవాలని, కనీస వేతనంగా రూ.26 వేలు చెల్లించాలని రూ.10 లక్షల బీమా చేయాలని కోరారు. అలాగే కాల పరిమితి సర్క్యులర్‌ను పూర్తిగా రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



దర్శిపోము నాగేంద్ర (ఫైల్)

కొవ్వూరు: ఈనెల 12న రోడ్డు ప్రమాదంలో గాయపడి రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దర్శిపోము నాగేంద్ర (25) గురువారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఇరగవరం మండలం రేలంగికి చెందిన నాగేంద్ర కొవ్వూరులో 15వ వార్డు కౌన్సిలర్ అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర వద్ద పనిచేస్తున్నాడు. పని ముగించుకుని ఈనెల 12వ తేదీ రాత్రి మోటార్ సైకిల్‌పై స్వగ్రామం వెళుతుండగా మార్గమధ్యలో వాడపల్లి శివారు బంగారమ్మపేట వద్ద నాగేంద్ర ప్రమాదానికి గురయ్యారు. ముందు వెళుతున్న లారీ ఆకస్మికంగా బ్రేక్ వేయడంతో వెనుక బైక్‌పై వస్తున్న నాగేంద్ర లారీని వెనుక నుంచి ఢీకొట్టి పడిపోయాడు.దీంతో తీవ్ర గాయాలైన నాగేంద్రను రాజమహేంద్రవరం జీఎస్ఎల్ ఆసుపత్రిలో చేర్పించారు.అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు కొవ్వూరు పట్టణ ఎస్సై బి.దుర్గా ప్రసాద్ తెలిపారు.మృతుడు నాగేంద్ర ఆ వివాహితుడు. మృతుడి సోదరుడు దర్శిపోము వీరేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ఉత్తమ అధికారి కృష్ణంరాజుకు సన్మానం

దేవరపల్లి: స్వాతంత్ర్య వేడుకల్లో ఉత్తమ ఎంపీడీవో అవార్డు అందుకున్న దేవరపల్లి ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజును మండలంలోని ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. స్థానిక మండల పరిషత్ కార్యలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత మాట్లాడారు. ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, వైస్ ఎంపీపీ కొర్లపాటి అరుణ, సాదే సుబ్బారావు, పార్టీ మండల కన్వీనర్ కూచిపూడి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

'మానవత ' శాంతి ర్యాలీ

దేవరపల్లి: మానవత సేవా సంస్థ మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం దేవరపల్లిలో శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం బీహెచ్ఎస్సార్ వీఎల్ఎం డిగ్రీ , పీజీ కళాశాలల విద్యార్థులు మానవహారం చేశారు. మానవత సంస్థ వారోత్సవాలను రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 16 నుంచి 22 వరకూ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శాంతి ర్యాలీ, మానవహారం నిర్వహించినట్టు ఆ సంస్థ రాష్ట్ర కార్యదర్శి బలుసు సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బోయపాటి రామలక్ష్మి, కేశిరాజు రాజ్‌కుమార్, జిల్లా డైరెక్టర్ బళ్ల సూర్యచక్రం, పప్పు వెంకటరామారావు, బండి సూర్యప్రకాశరావు, పచ్చా రాంగోపాల్ పాల్గొన్నారు.

అమ్మఒడి.. ఆనందాల సవ్వడి

- ఉత్సాహంగా బడికి వెళుతున్న విద్యార్థులు
- తల్లుల ఖాతాలకు ఏడాదికి రూ.15 వేల చొప్పున జమ
- పాఠశాలల్లో పెరుగుతున్న చేరికలు



వేగేశ్వరపురం కేపీస్సార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు

తాళ్లపూడి: విద్యార్థుల భవితకు అమ్మఒడి పథకం ఎంతో భరోసాగా నిలుస్తోంది. ఈ పథకం అమలులోకి వచ్చాక బడికి వెళుతున్న పిల్లల సంఖ్య గతంలో కంటే గణనీయంగా పెరిగింది. విద్యార్థుల తల్లుల బ్యాంక్ ఖాతాలకు నాలుగేళ్లుగా ఏడాదికి రూ.15 వేల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం జమ చేస్తోంది. చదువుకు పేదరికం అడ్డు కారాదనే సదుద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న అమ్మ ఒడి పథకాన్ని అమలు చేస్తున్నారు. ఏటా పండగ వాతావరణంలో అమ్మఒడి పథకాన్ని అమలు చేస్తున్నారు. గత ఎన్నికలకు ముందు ప్రకటించిన నవరత్నాల హామీ మేరకు జగన్ ప్రభుత్వం 1వ తరగతి నుంచి ఇంటర్ వరకూ చదువుతున్న విద్యార్థులకు ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ, ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలల్లో చదువుతు విద్యార్థులకు ఫీజుల భారం తగ్గుతోంది. అర్హులందరికీ నూరు శాతం అమ్మ ఒడి పథకం ద్వారా మేలు చేకూరేలా అధికారులు కృషి చేస్తున్నారు. లబ్ధిదారులైన విద్యార్థుల జాబితాలను ఏటా గ్రామ సచివాలయాల్లో ప్రదర్శిస్తున్నారు. తప్పులు ఏవైనా ఉంటే గడువులోగా సరి చేయించుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచిస్తున్నారు. పారదర్శకంగా పథకాన్ని అమలు చేస్తున్నారు.

మండలంలోని ఇలా..

తాళ్లపూడి మండలంలోని ఒకటి నుంచి 10వ తరగతి వరకూ 36 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ప్రయివేట్ పాఠశాలలు 14 ఉన్నాయి. వాటిలో మొత్తం 6,554 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వారిలో 4,798 మంది విద్యార్థులు జగనన్న అమ్మ ఒడి పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారు. వారికి తల్లుల బ్యాంకు ఖాతాలకు ఏటా రూ.7 కోట్లకు పైగా నగదు జమ అవుతోంది. మిగిలిన 1,765 మందీ ఒకే ఇంట్లో ఇద్దరు పిల్లలు ఉండడం, కరెంట్ బిల్లు ఎక్కువగా రావడం, ఫోర్ వీలర్, భూ సమస్యలు వంటి కారణాలతో అమ్మ ఒడి పథకానికి అర్హత సాధించలేకపోయారు.

అమ్మ ఒడితో మేలు



జగనన్న అమ్మఒడి పథకంతో పేదింటి పిల్లలకు మేలు జరుగుతోంది. పాఠశాలలకు వెళుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తుండడంతో మా చదువుపై తల్లిదండ్రులు శ్రద్ధ చూపుతున్నారు. ఏ రోజూ మానిపించకుండా స్కూల్‌కు పంపిస్తున్నారు.మా చదవు మా తల్లిదండ్రులకు ఆర్థిక భారం కావడం లేదు.

– శీసాల బంగారులక్ష్మి, విద్యార్థిని, అన్నదేవరపేట హైస్కూల్

పేదల చదువుకు బాట



మా లాంటి నిరుపేదల పిల్లలు ఉన్నత చదువులు చదువకోవడానికి జగనన్న అమ్మ ఒడి పథకం బాటలు వేసింది. ఖర్చుకు జడిసి పిల్లలను చదివించడానికి గ్రామీణ ప్రాంత పేద తల్లిదండ్రులు ఇప్పటికీ వెనకడుగు వేస్తున్నారు. అమ్మ ఒడి సాయం వల్ల తల్లితండ్రుల్లో ఇప్పుడా భయం పోయింది.

–సలాపు శరణ్య, విద్యార్థిని, అన్నదేవరపేట జెడ్పీ హైస్కూల్

పథకం సక్రమంగా అమలు



మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు అమ్మ ఒడి పథకాన్ని సక్రమంగా అమలు చేస్తున్నాం. బడికి పంపుతున్న విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నేరుగా సొమ్ములు జమ అవుతున్నాయి. మండలంలో 4798 మంది విద్యార్థులకు అమ్మ ఒడి పథకం ద్వారా సాయం అందుతోంది.

–సీహెచ్ బాలామణి, ఎంఈవో తాళ్లపూడి

కేంద్ర విధానాల వల్లే సంక్షోభంలో వ్యవసాయం

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య



చాగల్లులో షుగర్ ఫ్యాక్టరీ తక్షణమే తెరవాలని నిరసన తెలుపుతున్న రైతు సంఘాల నాయకులు

చాగల్లు: కేంద్రం ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాల వల్ల వ్యవసాయం రంగం తీవ్ర సంక్షోభంలో పడిందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య విమర్శించారు. వ్యవసాయరంగ నష్టాలకు, రైతుల ఆత్మహత్యలకు మోదీ ప్రభుత్వ విధానాలే కారణమని ఆయనన్నారు. రైతు సంఘం జిల్లా సదస్సును శుక్రవారం చాగల్లులోని సుబ్రహ్మణ్య మైదానంలో ఆ సంఘం జిల్లా సీనియర్ నాయకుడు ఉండవల్లి కృష్ణారావు అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని, రైతుల పంట రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని, రైతులకు అండగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం చాగల్లు షుగర్ ఫ్యాక్టరీ తక్షణమే తెరవాలని డిమాండ్ చేస్తూ ప్రధాన సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.శ్రీనివాస్, జిల్లా కన్వీనర్ గారపాటి వెంకట సుబ్బారావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబు, కంకటాల బుద్ధుడు, కేకే దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనను ఆశీర్వదించండి

- హోం మంత్రి తానేటి వనిత
- కొవ్వూరు రెండో వార్డులో కొనసాగిన గడప గడపకూ..



కొవ్వూరు రెండో వార్డులో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: కులమతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాల ద్వారా అన్ని వర్గాలకు లబ్ధి చేకూరుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత కోరారు. కొవ్వూరు పట్టణంలోని రెండో వార్డులో రెండో రోజు శుక్రవారం రాత్రి ఆమె గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత నాలుగేళ్ల పాలనలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ పథకాల లబ్ధి వారికి వివరించారు. సుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో అండగా నిలవాలని ప్రజలను కోరారు. మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, మునిసిపల్ వైస్ చైర్‌పర్సన్‌లు మన్నె పద్మ, గంధ్రోతు అంజనీదేవి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, వైఎస్సార్ సీపీ పట్టణ శాఖ అధ్యక్ష,గౌరవాధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, నగళ్లపాటి శ్రీనివాస్, మండలశాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, ఏఎంసీ మాజీ చైర్మన్లు బండి పట్టాభి రామారావు, వల్లభశెట్టి గంగాధర శ్రీనివాస్, పలువురు పార్టీ నాయకులు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పంచాయతీల్లో ఆన్‌లైన్ లావాదేవీలు

డీపీఓ సత్యనారాయణ



సమిశ్రగూడెం పంచాయతీ ఆఫీసులో రికార్డులు పరిశీలిస్తున్న డీపీఓ సత్యనారాయణ

నిడదవోలు రూరల్: గ్రామ పంచాయతీల్లో మరింత పారదర్శకంగా ఆన్‌లైన్ లావాదేవీలు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నామని జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) జేవీఎస్ సత్యనారాయణ తెలిపారు. మండలంలోని సమిశ్రగూడెం పంచాయతీ కార్యాలయంలో రికార్డులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీఓ సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో జిల్లాలో ఆన్‌లైన్ లావాదేవీలు చేపట్టేందుకు 300 పంచాయతీలకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా క్యూఆర్ కోడ్ ఇచ్చామన్నారు. అవినీతికి తావులేకుండా ప్రజలకు సేవలు అందిస్తామని చెప్పారు. సీజనల్ వ్యాధులు రాకుండా గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుదలకు చర్యలు చేపట్టామన్నారు. అక్టోబర్ 2వ లోపు నిర్మాణంలో ఉన్న గ్రామ సచివాలయ భవనాలను పూర్తిచేసి ప్రారంభిస్తామని చెప్పారు. ఈఓపీఆర్డీ ఎస్.రత్నమాలిక, పంచాయతీ కార్యదర్శి ప్రకాశరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న జిల్లా స్థాయి యోగా పోటీలు



యోగాసనంతో ఆకట్టుకున్న జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని జ్యోతి



విజేతలకు సర్టిఫికెట్లు అందించిన మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ

నిడదవోలు: జిల్లా స్థాయి యోగా పోటీలను శుక్రవారం స్థానిక రోటరీ ఆడిటోరియంలో నిర్వహించారు. రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా యోగా అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో ఈ పోటీలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి 180 మంది పోటీలకు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ ఈ పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ యోగా పోటీలు నిడదవోలులో నిర్వహించడం చాలా ఆనందదాయకమన్నారు. రాష్ట్ర యోగా అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ఆర్‌కే వర్మ మాట్లాడుతూ ఈ పోటీల్లో మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన క్రీడాకారులు వచ్చే నెల 9,10 తేదీల్లో కర్నూల్‌లో నిర్వహించే 48వ రాష్ట్రస్థాయి యోగా పోటీలకు జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో యోగా అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎస్ఎస్ చంద్రశేఖర్, క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు, క్లబ్ కార్యదర్శి కాళ్ళ రాంబాబు, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ పోలదాసు శ్రీనివాసరావు, గోపిరెడ్డి శ్రీనివాసు, కొత్తపల్లి నాగేశ్వరరావు, కొండాటి నాగేశ్వరరావు, యోగా గురువు ఎస్.సుబ్బారావు పాల్గొన్నారు.

నేడు వార్డు సభ్యత్వాలకు ఉప ఎన్నికలు



పెద్దగూడెం పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులతో మాట్లాడుతున్న ఏఎస్పీ రాజశేఖరరాజు



గోపాలపురం ఎంపీడీఓ ఆఫీసులో ఎన్నికల సిబ్బందికి సామగ్రి అందిస్తున్న ఎంపీడీఓ శ్రీదేవి

పంచాయతీ పేరు	వార్డు నంబర్	మొత్తం ఓట్లు	బూత్‌ల సంఖ్య
గోపాలపురం	12	534	1
గోపాలపురం	16	539	1
ఐ.పంగిడి	8	444	1
దమ్మెన్ను	9	135	1

కొవ్వూరు: డివిజన్‌లోని మూడు పంచాయతీల పరిధిలో నాలుగు వార్డు మెంబర్ పదవులకు శనివారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్టు డివిజనల్ పంచాయతీ అధికారి వై.అమ్మాజీ శుక్రవారం తెలిపారు. పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆమె తెలిపారు. డివిజన్‌లో నాలుగు పంచాయతీ మెంబర్‌ల ఎన్నికల్లో 1,652 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందుకోసం ఆయా పంచాయతీల్లో నాలుగు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి ముగ్గురు చొప్పున పోలింగ్ సిబ్బందిని నియమించామన్నారు. ఇద్దరు రిజర్వుడు సిబ్బందితో కలిపి మొత్తం 15 మంది పోలింగ్ సిబ్బందిని నియమించినట్టు డీఎల్‌పీవో అమ్మాజీ తెలిపారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన అడిషనల్ ఎస్పీ

గోపాలపురం: వార్డు సభ్యుల ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా పోలీసులు కృషి చేయాలని జిల్లా అడిషనల్ ఎస్పీ ఎస్ఆర్ రాజశేఖరరాజు అన్నారు. గోపాలపురం పంచాయతీ పరిధిలోని పెద్దగూడెంలోని 12,16 వార్డులకు శనివారం ఉదయం పోలింగ్ జరుగుతుంది. ఈ రెండు పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించి, పోలీసులకు తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ రాజశేఖరరాజు మాట్లాడుతూ పోలింగ్ ప్రారంభం నుంచి కౌంటింగ్ ముగిసే వరకూ శాంతి భద్రతలు అదుపులో ఉండాలన్నారు. ఈనెల 20వ తేదీ వరకూ 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. దేవరపల్లి సీఐ అనసూరి శ్రీనివాసరావు, నల్లజర్ల, దేవరపల్లి, ఎస్ఐలు గోపాలపురం పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

ఉండ్రాజవరం: వార్డు ఉప ఎన్నికల్లో ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదని కొవ్వూరు డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ హెచ్చరించారు. మండలంలోని దమ్మెన్ను పంచాయతీలోని 9 వార్డుకు ఉప ఎన్నికలు నిర్వహించే ఆ గ్రామంలోని బీసీ కమ్యూనిటీ హాల్ పోలింగ్ కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ఏర్పాట్లపై ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. మధ్యాహ్నం 1 గంట వరకు మాత్రమే పోలింగ్ కేంద్రాల్లోకి ఓటర్లను అనుమతిస్తామని తెలిపారు. డీఎస్పీ వెంట రిటర్నింగ్ అధికారి కోటిపల్లి సరోజిని, ఎస్సై కె.రామారావు ఉన్నారు.

ముఖ్యమంత్రి సభ విజయవంతం చేయాలి

పెరవలి: ఈ నెల 30న నిడదవోలులో నిర్వహించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బహిరంగ సభకు మండలం నుంచి భారీగా జనం తరలి వెళ్లాలని ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ, రెవెన్యూ, డ్వాక్రా, వైద్య ఆరోగ్య శాఖల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి గ్రామం నుంచి బస్సులు ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల నుంచి సీఎం బహిరంగ సభకు వచ్చే ప్రజలకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఎంపీడీఓ దామోదరరావు మాట్లాడుతూ ప్రతి సెంటర్‌లో రూట్ అధికారులను ఏర్పాటు చేస్తామన్నారు. అందుకు అవసరమైన సిబ్బంది సిద్ధంగా ఉన్నారని ఎటువంటి అవసరం వచ్చినా వీరిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ , పంచాయతీ కార్యదర్శులు, వీఆర్ఓలు, ఉపాధి, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

వెండి కవచాలతో దుర్గమ్మకు అలంకరణ



పాలంగి కనకదుర్గమ్మకు భక్తుల పూజలు

ఉండ్రాజవరం: శ్రావణ మాసంలోని మొదటి శుక్రవారం సందర్భంగా మండలంలోని పాలంగిలోని కనకదుర్గ అమ్మవారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పండితుడు లక్ష్మీధన్వంతరి ఆధ్వర్యంలో అమ్మవారిని రజత (వెండి) కవచాలతో అలంకరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, ఏఎంసీ వైస్ చైర్మన్ వెలిచేటి జానకిరామయ్య, సర్పంచ్ బొక్క శ్రీనివాసు, పాలాటి శరత్‌బాబుతో పాటు మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా తొలి శ్రావణ శుక్రవారం పూజలు

తాళ్లపూడి: శ్రావణ మాసంలోని తొలి శుక్రవారం కావడంతో తాళ్లపూడిలోని రాజ్యలక్ష్మి దేవాలయంలో అధిక సంఖ్యలో మహిళలు ఉదయం నుంచి పూజలు నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల చామంతులు, గులాబీలు, కనకాంబరం పూలతో అంకరించారు. పురాణ ఉపన్యాసకుడు పరస రాధాకృష్ణ శ్రావణ శుక్రవారం విశిష్టతను వివరించారు.

యూపీ స్కూల్లో డీఈఓ ఆకస్మిక తనిఖీ

ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీస్



చంద్రవరం స్కూల్ తరగతి గదిలో విద్యార్థి నోటు పుస్తకాన్ని పరిశీలిస్తున్న డీఈవో అబ్రహం

చాగల్లు: విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదని డీఈఓ ఎస్.అబ్రహం అన్నారు. మండలంలోని చంద్రవరం యూపీ స్కూల్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. తరగతి గదికి వెళ్లి 8వ తరగతి విద్యార్థుల గణితం నోట్ పుస్తకాలు పరిశీలించారు. విద్యార్థుల నోటు పుస్తకాలపై పర్యవేక్షణ లేని విషయాన్ని గుర్తించారు. అలసత్వం వహించిన గణిత ఉపాధ్యాయుడు రాధాకృష్ణపై షోకాజ్ నోటీసు జారీ చేశారు. పాఠశాలలో బోధన, మధ్యాహ్నన భోజనం తదితర విషయాలపై విద్యార్థుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల రికార్డులు పరిశీలించారు. మధ్యాహ్నా భోజనంలో నాణ్యత సరిగా పాటించకపోతే చర్యలు తీసుకుంటానన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ మండల సమావేశం

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ మండల శాఖ సమావేశాన్ని శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభం అవుతుందని మండల కన్వీనర్ కూచిపూడి సతీష్ తెలిపారు. దేవరపల్లిలోని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు క్యాంపు కార్యాలం వద్ద నిర్వహించే సమావేశంలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. మండలంలోని పార్టీ నాయకులు, వివిధ విభాగాల కన్వీనర్లు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు హాజరు కావాలన్నారు.

యువకుడ్ని రక్షించిన పోలీసులు



యువకుడిని బయటకు తీసుకు వచ్చిన పోలీసులు

గోపాలపురం: మద్యం మత్తులో మండలంలోని పెద్దాపురం గ్రామానికి చెందిన పెరుమళ్ల గణేష్ అనే యువకుడు పోలవరం కుడి ప్రధాన కాలువలోకి దూకాడు. ఈ ఘటన అదే గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఆ యువకుడిని పోలీసులు సకాలంలో రక్షించారు. అతడికి కౌన్సెలింగ్ ఇచ్చినట్టు దేవరపల్లి సీఐ అనసూరి శ్రీనివాసరావు తెలిపారు.